సాక్షి నిజామాబాద్

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



సాగునీరు అందించాలి

వచ్చే వానాకాలం నాటికి సిద్ధాపూర్ రిజర్వాయర్ ద్వారా సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే పోచారం అన్నారు.

- 8లో ▸



అన్ని వర్గాల సంక్షేమమే..

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
30.7 /21.1

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

5న జిల్లాకు బీసీ డెడికేటెడ్ కమిషన్ రాక

నిజామాబాద్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై అభిప్రాయాలు సేకరించడానికి గురువారం జిల్లాకు బీసీ డెడికేటెడ్ కమిషన్ రానున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఐఏఎస్, సెక్రెటరీ బి సైదులు ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి కలిగిన బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజలు అభిప్రాయాలు, సలహాలు సమర్పించవచ్చని వివరించారు. అభిప్రాయాలు తెలియజేసే వారు తమ వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, ఆధారాలను సమర్పించాలని సూచించారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం: ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు మణపురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంజీబీ మోటార్స్ అండ్ ఆటో ఏజెన్సీస్ కంపెనీ వారు హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, సేల్స్ ఆఫీసర్, అకౌంటెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇంటర్, డిగ్రీ పాసైనా వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నగరంలోని శివాజీ నగర్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు, 9948748428, 6305743423 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఈ నెల 5న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులకు మళ్లీ పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఈనెల 7 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక ఉంటుందన్నారు. ఫేస్–2లో సీటు పొందిన వారు ఈనెల 13 నుంచి 17 వరకు కళాశాలలో ప్రవేశం పొందాలన్నారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లు



నిజామాబాద్ సిటీ: మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. అమృత్–2 పనులకు సంబంధించి శిలాఫలకం వేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి పాల్గొంటారు. మంత్రి పర్యటన కోసం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ధర్నాచౌక్‌ను శుభ్రం చేశారు. స్థలాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ మంగళవారం పరిశీలించారు. పిచ్చి మొక్కలు తొలగించి గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు.

అటవీ సంపదను కాపాడాలి



వర్ని: అటవీ సంపద కాపాడాలని జిల్లా అటవీ శిక్షణ అధికారి కోటేష్‌యాదవ్ సూచించారు. మంగళవారం మోస్రా మండలం చింతకుంట గ్రామంలో అటవీ సంపద సంరక్షణపై అవగాహన సదస్సును నిర్వహించారు. అడవికి నిప్పు అంటకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అటవీ భూములను ఎవరైనా కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది హరీశ్, హుస్సేన్ పాల్గొన్నారు.

జలగర్భంలో పురాతన ఆలయాలు

జీజీనడ్కుడలోని మల్లన్నగుడి



జీజీనడ్కుడలోని మునీశ్వరుడి ఆలయం



డొంకేశ్వర్ మండలం జీజీనడ్కుడ ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో పురాతన ఆలయాలు నీటమునిగాయి. ప్రతి ఏడాది శివరాత్రికి నీరు తగ్గిపోయి ఆలయాలు బయటకు తేలుతాయి. దీంతో జీజీనడ్కుడ, గాదేపల్లి గ్రామ ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం అక్కడే భోజనాలు చేస్తారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరు చేరడంతో ఆలయ శిఖరాలు కనిపిస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నుడా పదవులకు పోటాపోటీ





- జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు విస్తరించిన సంస్థ పరిధి
- డైరెక్టర్ స్థానాల కోసం భారీ సంఖ్యలో ఆశావహుల నుంచి డిమాండ్
- రేసులో సుమారు 300 మంది సీనియర్ నాయకులు
- ఎంపిక కత్తిమీద సాములాగా మారడంతో అధికార పార్టీలోని పెద్దనాయకుల పరేషాన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పదవులకు ఆది నుంచి మంచి డిమాండ్ ఉంది. నామినేటెడ్ పదవులు కావడంతో చైర్మన్ పదవితో పాటు అందులోని డైరెక్టర్ పదవుల కోసం పోటీపడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇప్పటివరకు 'నుడా' పరిధి జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరం, చుట్టుపక్కల మాత్రమే ఉండడంతో ఈ ప్రాంతాల వాళ్లు మాత్రమే చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం పోటీ పడేవారు. అయినప్పటికీ ఈ పదవుల కోసం నాయకులు, కార్యకర్తల్లో తీవ్రమైన పోటీ నెలకొనేది. నగరంలో మంచి ప్రొటోకాల్ ఉన్న పదవి కావడంతో నుడా చైర్మన్ పదవి కోసం ముఖ్యమంత్రి స్థాయిలో పైరవీలు చేసుకున్న పరిస్థితి ఉంది.

పరిధి పెరగడంతో..

నిజామాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ పరిధిని తాజాగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని మండలాలకు, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలకు ప్రభుత్వం విస్తరించింది. 'నుడా' పరిధిని జిల్లా వ్యాప్తంగా విస్తరించే కొన్ని రోజుల ముందే రాష్ట్ర ప్రభుత్వం చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నిజామాబాద్ నగర అధ్యక్షుడు కేశ వేణును నియామకం చేసింది. అయితే డైరెక్టర్ పదవులను మాత్రం భర్తీ చేయలేదు. నుడా పరిధిని జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు విస్తరించిన అనంతరం డైరెక్టర్ల పదవుల భర్తీలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు విస్తృత స్థాయిలో కసరత్తు చేయాల్సిన అవశ్యకత ఏర్పడింది. అన్ని నియోజకవర్గాల పరిధి కావడంతో ఆయా నాయకులకు డైరెక్టర్ల ఎంపిక కత్తిమీద సాములా మారింది. లేఅవుట్స్, భవన నిర్మాణాల అనుమతులకు సంబంధించిన ఫీజులో ఆయా పట్టణాలు, గ్రామ పంచాయతీల నుంచి 20 శాతం నుడాకు బదిలీ చేస్తారు. ఇలా సమకూరిన నిధులతో కొత్త కొత్త రోడ్లు, పార్కులు, డివైడర్లు, హైమాస్ట్ లైట్లును నుడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా మొక్కల పంపిణీ సైతం చేయాల్సి ఉంటుంది.

■ గతంలో 'నుడా'లో 14 మంది డైరెక్టర్లు ఉండేవారు. ప్రస్తుతం పరిధి జిల్లా మొత్తం విస్తరించడంతో డైరెక్టర్ల సంఖ్య 30 మందికి వరకు పెరగనున్నట్లు అంచనా. అయితే ప్రస్తుతం డైరెక్టర్ల పదవుల కోసం చాలా మంది ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో అన్ని మండలాల పరిధి ఉండడంతో అన్ని నియోజకవర్గాల నుంచి సుమారు 300 మంది ఆశావహులు పోటీలో ఉన్నారు. సీనియర్ కార్యకర్తలతో పాటు సీనియర్లు కాని వారు, ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారు, రైతులు, రైతు నాయకులు, వ్యాపారులు, మైనారిటీ నాయకులు డైరెక్టర్ల పదవుల రేసులో ఉన్నారు. మరోవైపు కుల సమీకరణాలు సైతం కీలకం కానున్నాయి. దీంతో డైరెక్టర్ల కూర్పు విషయంలో జిల్లా పెద్ద నేతలు సుదర్శన్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్, భూపతిరెడ్డి, షబ్బీర్ అలీ, మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు, బాడ్సి శేఖర్‌గౌడ్, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డిలు ప్రత్యేకంగా కూర్చుని కసరత్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సొంతింటికి సాయం ఎప్పుడో?

- సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే రూ.5 లక్షలు ఇస్తామని హామీ
- కార్యాచరణ ప్రారంభించని ప్రభుత్వం



మోర్తాడ్(బాల్కొండ): సామాన్యుడి సొంతింటి కలను నెరవేర్చడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.ఐదు లక్షల సాయం చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి విడతలో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇళ్లకు సాయం అందిస్తామని పేర్కొంది. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తులను సైతం స్వీకరించారు. అయితే కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి ఏడాది గడుస్తున్నా ఇంకా ఇందిరమ్మ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు రాకపోవడం, కార్యాచరణ ప్రారంభించకపోవడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

'డబుల్' ఇళ్లు అందక నిరాశ

బీఆర్ఎస్ హయాంలో సొంతంగా ఇంటిని నిర్మించుకునేవారికి సాయం అందించే పథకాన్ని నిలిపివేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి పేదలకు అందజేశారు. తక్కువ సంఖ్యలో డబుల్ ఇళ్లను నిర్మించడంతో చాలా మంది పేదలకు నిరాశే మిగిలింది. కనీసం ఇంటి నిర్మాణం కోసం సాయం అందిస్తే తాము కొంత డబ్బు సమకూర్చుకుని సొంతింటి కలను నెరవేర్చుకుంటామని అనేక మంది భావించారు. అయితే ఎన్నికల ముందు గత ప్రభుత్వ పెద్దలు గృహజ్యోతి పథకం పేరిట ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున సాయం అందిస్తున్నట్లు ప్రొసిడింగ్‌లను జారీ చేశారు. అధికారుల సంతకాలు లేకుండానే ప్రొసిడింగ్‌లను జారీ చేయడం, బీఆర్ఎస్ అధికారం నుంచి తప్పుకోవడంతో ఆ కాగితాలు చెత్తబుట్ట పాలయ్యాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించి బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. కానీ సాయం అందించే ప్రక్రియను మాత్రం ప్రారంభించలేదు. దీంతో ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలు నిరాశ చెందుతున్నారు.

ఎంతో మంది ఎదురు చూస్తున్నారు



గ్రామాల్లో ఎంతో మంది ఇంటి నిర్మాణ సాయం కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొంత సాయం అందిస్తే తాము కొంత వేసుకొని చిన్న ఇంటిని నిర్మించుకుంటామని భావిస్తున్నారు.

– కదారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్, సుంకెట్

మాట నిలబెట్టుకోవాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల కోసం ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి. ఎంతో మంది సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

– తోకల నర్సయ్య, మాజీ సర్పంచ్, తాళ్లరాంపూర్

దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, అదనపు కలెక్టర్ అంకిత్



నృత్యం చేస్తున్న చిన్నారులు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నిజామాబాద్ నాగారం: దివ్యాంగులకు అండగా ఉండి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. మంగళవారం మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి రసూల్ బీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆవరణలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు దివ్యాంగులకు అండగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చూడాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులకు, దివ్యాంగ ఉద్యోగులకు సన్మానం చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నవంబర్ 21న నిర్వహించిన వివిధ రకాల క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, అదనపు కలెక్టర్ అంకిత్, సుదాం లక్ష్మి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీఆర్‌డీవో సాయాగౌడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, స్నేహ సొసైటీ సెక్రెటరీ సిద్ధయ్య పాల్గొన్నారు.

యాసంగిలోనూ సన్నాలే..!

- గంగా కావేరి, కునారం రకాల సాగుకు మొగ్గు చూపుతున్న అన్నదాతలు
- వచ్చే సీజన్‌కు కూడా బోనస్ ప్రకటించిన సర్కారు
- దొడ్డు రకం జోలికి పోని రైతులు



డొంకేశ్వర్(ఆర్మూర్): 'బోనస్' ప్రభావం వరి సాగులో మార్పులు తెచ్చింది. గత సీజన్‌లో సాగు చేసిన సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడంతో 'యాసంగి' సీజన్‌లో కూడా సన్నాలే సాగు చేయాలని రైతులు నిర్ణయానికి వచ్చారు. గతేడాది వరకు దొడ్డు రకాలు ఎక్కువగా సాగు చేసిన అన్నదాతలు ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌తో సన్నాల వైపు మళ్లారు. ప్రభుత్వం కూడా సన్న రకాల సాగునే ప్రోత్సహించడంతో రైతులు దొడ్డు రకాలు వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. యాసంగి పంటకు కూడా బోనస్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటన చేయడంతో వరినారు పోసే రైతులు పూర్తిగా సన్నాలే పోస్తున్నారు. విత్తన దుకాణాల్లో, సీడ్స్ కంపెనీల్లో ఎక్కువగా సన్న రకాల విత్తనాలనే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వానికే విక్రయించి బోనస్ పొందాలనే ఉద్దేశంతో విత్తన వ్యాపారులతో ఒప్పందాలను సైతం తగ్గించారు. యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 4,19,486 ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బోనస్ ప్రభావంతో ఇంతకు మించి కూడా సాగయ్యే పరిస్థితి ఉంది.

ముందస్తుగా యూరియా కొనుగోలు

సీజన్ మొదలైందో లేదో రైతులు యూరియా, డీఏపీ బస్తాలను ముందస్తుగానే కొనుగోలు చేసి నిల్వ చేసి పెట్టుకుంటున్నారు. ఇటీవల పంజాబ్, హరియాణా, యూపీ రాష్ట్రాల్లో డీఏపీ కొరత ఏర్పడడంతో రైతులు అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. యాసంగి సీజన్‌కు 75 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ సొసైటీలు, దుకాణాల వద్ద కలిపి ప్రస్తుతం 25 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. అలాగే డీఏపీ 18,900 మెట్రిక్ టన్నులకు గాను 2,828 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, అవసరానికి సరిపడా మాత్రమే కొనుగోలు చేసి తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ సూచిస్తున్నారు.

గంగా కావేరి అధికం

రైతులు సన్న రకాల సాగులో అధికంగా గంగా కావేరి రకం విత్తనాలను కొనుగోలు చేసి నారు పోస్తున్నారు. గంగా కావేరి పంట తక్కువ సమయంలో చేతికి రావడంతో దిగుబడి కూడా ఎక్కువగా ఉంటుంది. సులువైన పంట కావడంతో పాటు చీడ పీడలను సైతం తట్టుకుంటుంది. అందుకే ఈ రకాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. గంగా కావేరి తర్వాత కునారం (కేఎస్ఎం 1638), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్15048) రకాలను కూడా రైతులు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నారు పోశారు. బోధన్ నియోజకవర్గంలో పొలాలను దమ్ము చేసి నాట్లు కూడా వేస్తున్నారు. మరో పక్షం రోజుల్లో జిల్లా అంతటా నాట్లు మొదలు కానున్నాయి. నాట్లు వేసేందుకు మహారాష్ట్ర, యూపీ, బీహార్ నుంచి కూలీలను రప్పించడానికి మునీంలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎన్‌డీసీసీబీని మొదటి స్థానంలో నిలపాలి

- రూ.రెండు వేల కోట్లకు చేరిన డీసీసీబీ వ్యాపార లావాదేవీలు



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ డీసీసీబీలో లక్ష్యం మేరకు వ్యాపారం చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాంకు వ్యాపార కార్యకలపాలు రూ.రెండు వేల కోట్ల టోర్నవర్ మార్కు చేరుకున్న సందర్భంగా మంగళవారం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ముందుగా లక్ష్యం చేరుకున్నందుకు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్‌లో రూ.794 కోట్లు డిపాజిట్లు, పంట రుణాలు రూ.600 కోట్లు, బంగారు ఆభరణ రుణాలు రూ.317 కోట్లు, ఇతర రుణాలు రూ.313 కోట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రుణమాఫీలో బ్యాంకులో 40,654 మంది రైతులకు రూ.169.73 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. అలాగే మాఫీ పొందిన రైతులకు రూ.160.47 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగతా వారికి త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు రమేశ్‌పాటిల్, ఆనంద్, ప్రొఫెషనల్ డైరెక్టర్ యాదగిరి, సీఈవో నాగభూషణం, జనరల్ మేనేజర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- ప్రజాభవన్‌లో నిజాం షుగర్స్ కార్మికుల వినతి

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) కార్మికుల బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఫ్యాక్టరీల కార్మిక సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణికి మూడు ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నాయకులు వెళ్లి వినతి పత్రం అందించారు. ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రత్యేక ఐఏఎస్ అధికారి దివ్యను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. లే ఆఫ్ నాటి నుంచి ఇప్పటి వరకు బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది కార్మికులు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో చనిపోయారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించి ఆదుకోవలని కోరారు. మూడు ఫ్యాక్టరీలకు చెందిన కార్మిక నాయకులు ఉపేందర్, కుమారస్వామి, నరహరి, ముత్తయ్య, రాజయ్య, పోల్కు స్వామి, జాకోబ్, కిషన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణకు నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి ఎలక్ట్రీషియన్, సీసీ టీవీ కోర్సులలో శిక్షణ ప్రారంభమవుతాయన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19–40 మధ్య వయసు గల యువకులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఆధార్, రేషన్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు ఫొటోలు తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ సౌకర్యం పూర్తిగా ఉచితంగా ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్ అందజేస్తారని, మరిన్ని వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సైక్లింగ్ జట్టు ఎంపికలు పూర్తి

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలుర విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి సైక్లింగ్‌లో ఎంపిక పోటీలు నిర్వహించారు. మంగళవారం క్రీడల కార్యదర్శి నాగమణి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి విజయకాంత్‌రావు ఆధ్వర్యంలో కంఠేశ్వర్ బైపాస్‌రోడ్‌లో చేపట్టారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొనున్నారు. ఎంపికైన వారిలో ఆర్ మనీష్, రాకీబాబా, రాథోడ్‌కార్తీక్, అఖిల్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో గోపిరెడ్డి, మధుకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాస్ పరీక్షకు ఏర్పాట్లు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో బుధవారం నిర్వహించే న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో అశోక్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని 130 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల నుంచి 3,337 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారని అన్నారు. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. పరీక్షకు కోఆర్డినేటర్లుగా జీవన్, సీతయ్య, లక్ష్మీనాథంలు పాల్గొంటారు. మరో 130 మంది పరిశీలకులు, 179 క్షేత్ర స్థాయి పరిశీలకులు, 18 మంది రిజర్వు క్షేత్ర స్థాయి పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.

అబ్జర్వర్లకు శిక్షణ

న్యాస్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన అబ్జర్వర్లకు మంగళవారం కేంద్రీయ విద్యాలయంలో శిక్షణ ఇచ్చారు. న్యాస్ పరీక్ష ఢిల్లీ పరిశీలకులు సంజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు శిక్షణ ఇచ్చారు. పరీక్ష నిర్వహణ సమయపాలన, 130 పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తదితర అంశాలపై ఈ శిక్షణ ఇచ్చారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే సీఎం కప్

- 7 నుంచి టోర్నీ ప్రారంభం
- గ్రామస్థాయి నుంచి పోటీలు
- రాష్ట్ర స్థాయి విజేతకు రూ.లక్ష బహుమతి



నిజామాబాద్ నాగారం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న మంగళవారం పేర్కొన్నారు. తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయి, మండల స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు www.cmcup2024.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ స్థాయిలో..

ఈ నెల 7, 8 తేదీల్లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని మండల స్థాయికి పంపిస్తారు. పంచాయతీ కమిటీలో జీపీ కార్యదర్శి చైర్మన్‌గా, పాఠశాల హెడ్‌మాస్టర్ కన్వీనర్‌గా, పీఈటీ, పీడీ సీనియర్ క్రీడాకారులు, వీఏలు సభ్యులుగా ఉంటారు.

మండల స్థాయిలో..

ఈ నెల 10 నుంచి 12 వరకు మండల, మున్సిపాలిటీ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. మండల సెలక్షన్ కమిటీలో స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా, ఎంపీడీవో కన్వీనర్, తహసీల్దార్, ఎంఈవో, ఎస్సై, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సభ్యులుగా వ్యవహరిస్తారు. మున్సిపాలిటీల్లో మున్సిపల్ చైర్మన్/మేయర్ చైర్మన్‌గా, కమిషనర్‌లు కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎంఈవో, ఎస్సై, ఎజీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, సీనియర్ క్రీడాకారులు సభ్యులుగా ఉంటారు.

జిల్లాస్థాయిలో..

మండల, మున్సిపల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈ నెల 16 నుంచి 21 వరకు జిల్లాస్థాయి పోటీలు ఉంటాయి. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, కుస్తీ, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, చెస్, బేస్‌బాల్, నెట్‌బాల్, బాక్సింగ్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, సైక్లింగ్, ఉషూ, జూడో, కిక్ బాక్సింగ్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందిస్తారు. వారిని రాష్ట్రస్థాయికి పోటీలకు పంపుతారు.

రాష్ట్రస్థాయిలో..

రాష్ట్రస్థాయి పోటీలో గెలిచిన విజేతలకు రూ.లక్ష, ద్వితీయస్థానంలో ఉన్న జట్టుకు రూ.75వేలు, మూడో స్థానంలో ఉన్న జట్టుకు రూ. 50వేలు నగదు బహుమతి అందజేస్తారు. అలాగే వ్యక్తిగత క్రీడాంశంలో విజేతకు రూ.20వేలు, రన్నర్‌కు రూ.15వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.10వేలు నగదు ఇస్తారు.

మలేషియా సమావేశానికి ప్లీనరీ స్పీకర్‌గా క్షత్రియ హెచ్‌వోడీ

పెర్కిట్: మలేషియా దేశం కౌలాలంపూర్‌లో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే గ్లోబల్ కాంగ్రెస్ ఆన్ సస్టైనబుల్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్ సమావేశానికి ప్లీనరీ స్పీకర్‌గా ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ హెచ్‌వోడీ మాడవేడి సుధాకర్ ప్రసంగించనున్నారు. మలేసియాలో ఐన్‌స్టీన్ రీసర్చ్ అకాడమీ, ఇంటి ఇంటర్నేషనల్ యూనివర్సిటీ మలేషియా కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న సమావేశంలో సుధాకర్ ప్లీనరి స్పీకర్‌గా ప్రసంగిచనున్నట్లు కళాశాల యాజమాన్యం మంగళవారం వెల్లడించారు.



మాడవేడి సుధాకర్

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ స్టడీస్ మొదలైన విభాగాలు పోషించాల్సిన పాత్రపై సుధాకర్ ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.

రాష్ట్రస్థాయిలో జిల్లాకు పతకాలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ అండర్–17 బాలికల టోర్నమెంట్‌లో జిల్లాకు పతకాలు వచ్చాయి. హన్మకొండలో టోర్నీ కొనసాగుతుండగా జిల్లాకు చెందిన క్రీడాకారులు శృతి, శ్రీవల్లి బంగారు పతకాలు, శ్వేతజీ రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను క్రీడల కార్యదర్శి నాగమణి ప్రత్యేకంగా అభినందించారు. బంగారం పతకం సాధించిన ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి టోర్నీకి ఎంపికయ్యారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

నిజామాబాద్ రూరల్: అధికారం చేపట్టిన ఏడాదిలోనే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని ముదక్‌పల్లి శివారులోని పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 7నాటికి ప్రభుత్వం చేపట్టి ఏడాది పూర్తవుతున్నందున రాష్ట్రంలో విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిధులు, నీళ్లు, నియామకాలపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం గత పాలకుల చేతిలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు, ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కు సిలిండర్, రైతులకు మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు అదనపు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో 15 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ తరహా సంక్షేమ పథకాలు లేవని ఎమ్మెల్యే భూపతిరెడ్డి బీజేపీ పార్టీపై దుయ్యబట్టారు. తెలంగాణ బీజేపీ నాయకులు గుజరాతీలకు గులామ్‌గిరి చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కాంగ్రెస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శలు చేయడం తగదన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఆరువేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు, 12వేల మంది టీచర్లకు ప్రమోషన్లతో కూడిన పోస్టింగ్‌లు ఇచ్చామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఓడిసిన ముచ్చటేనని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బాడ్సి శేఖర్‌గౌడ్, నాయకులు బాగిర్తి బాగారెడ్డి, అగ్గు బోజన్న, సాయారెడ్డి, గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, దాసరి శ్రీధర్, రాజాకిషన్, కె శ్రీనివాస్, పి శ్రీనివాస్, భూమయ్య, కరాటే రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం నాటికి సాగునీరు అందించాలి

వర్ని: వచ్చే వర్షాకాలం నాటికి సిద్దాపూర్ రిజర్వాయర్ ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని ఇందుకు ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతగా నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్లు 24 గంటలు ప్రాజెక్టు వద్ద ఉండి పనులను పర్యవేక్షించి నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 14వేల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందుతుందని తద్వారా రైతులు పుష్కలంగా పంటలు పండించి ఆర్థికంగా ఎదుగుతారని వెల్లడించారు. రూ. 258 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ప్రముఖ హోమియో వైద్యుడు శివప్ప మృతి

బోధన్: బోధన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ హోమియో వైద్యుడు శివప్ప(61) మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన శివప్ప కామారెడ్డి జిల్లా బీర్కూర్‌కు దత్తత వచ్చాడు. అనంతరం బోధన్‌లో క్లినిక్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత హోమియో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన బీజేపీ నాయకుడిగా పని చేశారు. 1990లో బీజేపీ అనుబంధ యువ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1992–96 వరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2000–2004 వరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.



శివప్ప (ఫైల్)

2009లో బీజేపీ నుంచి బోధన్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఏడాది కాలం నుంచి హైదరాబాద్‌లోని తన కూతురు వద్ద ఉంటున్నారు. కాగా ఈ ఏడాది అక్టోబర్ 8న ఆయన కుమారుడు విశ్వనాథ్(32) ఆరోగ్య సమస్యలతో మృతి చెందాడు. రెండు నెలల్లో తండ్రీకొడుకులు మృతి చెందడంతో విషాదం నెలకొంది.

ఏం చేశారని విజయోత్సవాలు

- ప్రజాపాలన విజయోత్సవాలపై అర్బన్ ఎమ్మెల్యే మండిపాటు
- సీఎంకు 26 ప్రశ్నలు సంధించిన ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నిజామాబాద్ సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని ప్రజాపాలన–విజయోత్సవాలు నిర్వహిస్తారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. 26 ప్రశ్నలతో సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖను రాసి పోస్టుచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏడాది కాలంగా రాష్ట్ర ప్రజలకు ఏం చేశారని అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజాధనం వృథా తప్ప ఒరిగేందేమి లేదన్నారు. తాను సంధించిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానాలివ్వాలని డిమాండ్ చేశారు.

ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయనందుకు, కౌలు రైతులకు భరోసా ఇవ్వనందుకు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, పేదింటి మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో తులం బంగారం ఇవ్వనందుకు విజయోత్సవాలు జరుపుతున్నారా అని ప్రశ్నించారు. చదువుకునే అమ్మాయిలకు స్కూటీ, నిరుపేదలకు ఇస్తామన్న ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగ భృతి, పెంచుతామన్న పింఛన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. గురుకులాల్లో ఆహారంలో కల్తీ నియంత్రణ ఏది? జర్నలిస్టులకు ఇస్తానన్న రూ. 100 కోట్ల నిధులేమాయే? హిందూ దేవతల గుడులపై దాడులు జరుగుతున్నా మౌనం వహిస్తున్నందుకు విజయోత్సవాలు జరుపుతున్నారా అని సీఎంను ధన్‌పాల్ ప్రశ్నలు సంధించారు. ఏడాది కాలంలో తెలంగాణను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, కిశోర్ పాల్గొన్నారు.



బహిరంగ లేఖను చూపుతున్న అర్బన్ ఎమ్మెల్యే

'కుమారుడి మృతిపై విచారణ జరిపించాలి'



బోధన్‌టౌన్(బోధన్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గూడాల శివ జస్విత్‌రెడ్డి(14) మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, సరైన విచారణ జరిపించి న్యాయం చేయాలని విద్యార్థి తండ్రి, బంధువులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కోరారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. మీ కుమారుడు అనారోగ్యంతో ఉన్నాడని గత నెల 28న ఉదయం 9:30 గంటలకు పాఠశాల నుంచి ఫోన్ వచ్చిందని.. నేను పాఠశాలకు వెళ్లేసరికి నలుగురు తోటి విద్యార్థులు జస్విత్ రెడ్డిని మోసకొస్తున్నారని.. ఎలాంటి కదలికలు లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రతిభా ఆస్పత్రిలో చేర్పించామన్నారు. వారు చెక్ చేసి ప్రాణం లేదని చెప్పారని విద్యార్థి తండ్రి భాస్కర్ రెడ్డి వాపోయారు. కాకతీయ యాజమాన్యం మాకు శవాన్ని అప్పగించిందని..ఈ విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా ఉందని, సరైన విచారణ జరిపి న్యాయం చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



పిట్లం: మండలంలోని తిమ్మనగర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మంగళవాం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని మార్దండ గ్రామానికి చెందిన వడగామ మల్లయ్య(30) పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మంగళవారం విధులు నిర్వహించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా తిమ్మనగర్ శివారులో గుర్తు తెలియని వాహణం ఢీకొనడంతో మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

కమ్మర్‌పల్లి: బైక్ చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష పడినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చౌట్‌పల్లికి చెందిన సమర గంగాజమునకు చెందిన బైక్ చోరీకి గురైంది. ఈమేరకు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన బోదాసు మహేశ్‌ను అరెస్ట్ చేసి ఆర్మూర్ కోర్టుకు తరలించారు. కేసు విచారణ అనంతరం పూర్వపరాలను పరిశీలించిన ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ దీప్తి మంగళవారం తీర్పును వెలువరించారు. నిందితుడికి ఏడాది జైలుశిక్షను విధించారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్ల రామారావు, రాజులను ఎస్సై అనిల్ రెడ్డి అభినందించారు.

అర్ధరాత్రి షాపు తెరిచిన వ్యక్తికి రెండు రోజులు..

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్‌కాలనీ చెందిన మోహన్ తన కిరాణ దుకాణాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిమితికి మించి రాత్రి తెరిచి ఉంచటంతో కేసు నమోదు చేసినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 30న తన కిరాణషాప్ దుకాణాన్ని తెరిచి ఉంచడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మోహన్‌కి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మూడో టౌన్ పరిధిలో ఎవరైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిమితికి మించి షాపులు తెరిచి ఉంచితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రూ.3.85 కోట్ల గంజాయి, అల్ప్రాజోలం కాల్చివేత



కామారెడ్డి క్రైం: జిల్లా వ్యాప్తంగా 36 కేసుల్లో పట్టుబడిన రూ. 3.51 కోట్ల విలువ చేసే గంజాయి, అల్ప్రాజోలాన్ని సంబంధిత అధికారులు కాల్చివేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో ఉన్న శ్రీ మెడికేర్ సర్వీస్ కేంద్రంలో మంగళవారం ఆయా మత్తు పదార్థాలను దగ్ధం చేశారు. కాల్చి వేసిన వాటిలో కామారెడ్డి జిల్లాలోని ఐదు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన 36 కేసులకు సంబంధించి 783.36 కిలోల గంజాయి, 16.625 కిలోల అల్ప్రాజోలం, 1.15 కిలోల డైజోఫాం, 852 గ్రాముల క్లోరల్ హైడ్రైట్, 230 గంజాయి మొక్కలు ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్ రావు తెలిపారు. కాల్చి వేసిన మత్తు పదార్థాల విలువ రూ.3,85,71,325 ఉంటుందని అన్నారు.

సబ్‌మెర్సిబుల్ మోటారు చోరీ

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగులో బోరు బావి నుంచి సబ్‌మెర్సిబుల్ మోటారును తొలగించి దుండుగులు ఎత్తుకెళ్లారని బాధితుడు సాయిరి కృష్ణ మంగళవారం తెలిపారు. వ్యవసాయ పొలం వద్ద సోమవారం సాయంత్రం వరకు అక్కడే ఉన్నానని, మంగళవారం ఉదయం వెళ్లి చూసేసరికి బోరు బావిలో నుంచి మోటారును ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. కేబుల్ తీగలను, ఇతర సామాగ్రిని అక్కడే వదిలేసి 7.5 హెచ్‌పీ మోటారును ఎత్తుకెళ్లారని తెలిపారు. చోరీ అయిన మోటారు విలువ రూ. యాభై వేల విలువ ఉంటుందని అన్నారు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

సుభాష్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: సుభాష్‌నగర్ కాలనీలోని ఓ కిరాణ దుకాణంలో చైన్ స్నాచింగ్ జరిగినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ ప్రాంతంలోని వెంకటరెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న కిరాణ దుకాణానికి ఓ వ్యక్తి వచ్చి సిగరెట్, కూల్ డ్రింక్ తాగి డబ్బులను యజమాని రజినికి ఇచ్చాడు. ఆమె డబ్బులను కౌంటర్‌లో పెడుతుండగా సదరు వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలు రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

ఖలీల్‌వాడి: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి మనస్తాపంతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన షేక్ సలీం(31) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 18 నెలల క్రితం భీంగల్ పట్టణానికి చెందిన షేక్ ఇస్తానాతో వివాహమైంది. అతను గతేడాది నుంచి మద్యానికి బానిసై ఎలాంటి పనిచేయడం లేదు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో అతిగా మద్యానికి బానిసయ్యాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో నాగారంలోని ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

గాంధారి: మద్యానికి బానిసైన ఒకరు జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గాంధారి మండలం సర్వాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముదెల్లి పోచయ్య(45) జీపీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అతను మద్యానికి బానిసై డబ్బుల కోసం భార్య వినోదను ఇబ్బంది పెట్టేవాడు. మంగళవారం ఉదయం మద్యానికి డబ్బులు కావాలని భార్యను అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో కొట్టాడు. ఆమె బయటకు వెళ్లిపోయిన సమయంలో పోచయ్య ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు లేరని..

బోధన్‌రూరల్: తనకు తల్లిదండ్రులు లేరనే మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బోధన్ మండలంలోని సంగం గ్రామంలో చోటు చేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మనీష(జానకి)(18)కి చిన్న నాటి నుంచి తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల వద్ద ఉంటోంది. తనకు అందరిలా తల్లిదండ్రులు లేరనే మనస్తాపంతో ఈ నెల 2న రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువు సుంకరి రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాపర్ వైర్ చోరీలో నిందితుల అరెస్ట్

ఖలీల్‌వాడి: ఎలక్ట్రిక్ కాపర్ వైర్ చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవంబర్ 19న రాత్రి 11 గంటల సమయంలో నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధి మెదక్ జిల్లాలోని లక్ష్మాపూర్, శమ్నాపూర్ రైల్వేస్టేషన్ మధ్యలో కొత్తగా రైల్వే ఎలక్ట్రిక్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నిందితులు 320 మీటర్ల ఎలక్ట్రిక్ కాపర్ వైరును కట్ చేసి దొంగిలించారు. ఇండస్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన సూపర్ వైజర్ ప్రవీణ్ నవంబర్ 22న నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు మంగళవారం మెదక్ జిల్లాలోని హవేళి ఘన్‌పూర్‌కు చెందిన అనుమానితులు మూడవత్ అమీన్, మూడవత్ సుభాష్‌లను పట్టుకుని విచారించగా కాపర్ వైర్లను చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితులలో పాటు వీరికి సహకరించిన టింకు సత్యంను అదుపులోకి తీసుకున్నారు. కాపర్‌వైర్‌ను కొనుగోలు చేసిన దుకాణానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన కాపర్ విలువ రూ.1.28 లక్షలు ఉంటుందని, నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సీఐ శ్రీనివాస్, ఎస్సై తావు నాయక్, గురుదాస్, సలావుద్దీన్ పాల్గొన్నారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

వైన్ షాప్, కిరాణ దుకాణంలో చోరీ

రుద్రూర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. వైన్ షాప్, కిరాణ దుకాణాలకు రంధ్రాలు చేసి చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కోటగిరి రోడ్డులో ఉన్న వైన్స్ వెనుక వైపు రేకును కట్ చేసి దుండుగుల లోపలికి చొరబడ్డారు. అందులోని రూ. 48వేల నగదు, రూ. 48వేల విలువ చేస మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. అంగడిబజార్‌లోని కిరాణ దుకాణం గోడకు రంధ్రం చేసి లోపలికి వెళ్లి సుమారు రూ.10వేలు విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు, నిత్యావసర వస్తువులను దొంగిలించారు. కిరాణషాపునకు సమీపంలో ఉన్న హోటల్‌లో చోరీకి విఫలయత్నం చేశారు. స్థానికుల సమాచారం మేరకు మంగళవారం ఉదయం రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్సై సందీప్ ఘటన స్థలాలను పరిశీలించారు. దొంగల వ్రేలి ముద్రలను గుర్తించేందుకు క్లూస్ టీమ్‌ను రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



యువతి అదృశ్యం

లింగంపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సురేందర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి తల్లిదండ్రులు ఈ నెల 2న బంధువుల వివాహ నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తన కుమార్తె లేకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నవీపేటలో యువకుడు..

నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన రాజేశ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ మంగవారం తెలిపారు. ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. రాజేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అశోక్ తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కుమారుని అదృశ్యంపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు.

మంగళ్‌పాడ్‌లో మరొకరు..

ఎడపల్లి: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన నరేందర్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై తెలిపారు. గ్రామానికి చెందిన నరేందర్ బోధన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో దోబీ పని చేస్తున్నాడు. ప్రతి రోజుల ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేవాడు. గత నెల 19న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నరేందర్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన సాయన్న, శ్రీనివాస్‌లకు చెందిన ఇల్లు మంగళవారం దగ్ధమైంది. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయన్న, శ్రీనివాస్ ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌కు షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఇంట్లో మంటలు వ్యాపించాయి. వెంటనే కుటుంబీకులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఇల్లు పూర్తిగా దగ్ధమైందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.